క్లుప్తంగా

నేడు హుజూర్‌నగర్‌లో నిజాముద్దీన్ సంతాప సభ

- హాజరుకానున్న మండలి చైర్మన్ గుత్తా, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నిజాముద్దీన్ సంతాప సభ శుక్రవారం హుజూర్‌నగర్‌లోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ పీఆర్‌ఓ వెంకటరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్‌పీ మాజీ నేత కె.జానారెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

మునగాల : మండల కేంద్రంలోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయంతో పాటు గ్రంథాలయ ఆవరణలో గల ప్రభుత్వ స్థలాన్ని ఓ కుటుంబం ఆక్రమించిందని, వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం మండల వ్యవసాయాధికారి బుంగా రాజు.. మునగాల తహసీల్దార్ బి.రామకృష్ణారెడ్డికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 244, 245, 246 సర్వే నంబర్లలో ఉన్న స్థలాన్ని సమగ్ర సర్వే చేసి అక్రమ కట్టడాలను కూల్చివేయాలని కోరారు. ఇదే సర్వేనంబర్లలో నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలకు హద్దులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు కోరినట్లు తెలిపారు.

సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలి

హుజూర్‌నగర్ : సాగర్ ఎడమ కాలువ ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి కోరారు. గురువారం ఆయన హుజూర్‌నగర్ విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో రైతులు బావులు, బోర్ల ఆధారంగా నార్లు పోసుకున్నారని తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో భూగర్భ జలాలు అడుగంటి నాట్లు వేస్తే నీరందక పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని, సాగర్ ప్రాజెక్టులో నీరు 559 అడుగులకు చేరినందున ఆయకట్టుకు వెంటనే నీరు విడుదల చేసేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవ తీసుకొని రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.

నడిగూడెం ఎంపీడీఓగా మల్సూర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ మల్సూర్

నడిగూడెం : నడిగూడెం ఎంపీడీఓగా మల్సూర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. సంగారెడ్డి జిల్లా నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. నేరేడుచర్ల మండలం ఎంపీఓగా పనిచేస్తూ నడిగూడెం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేసిన హరిసింగ్ తిరిగి సొంత మండలానికి వెళ్లారు.

బాలికలు మానసిక ధైర్యంతో ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మోటివేటర్ స్వాతి

మునగాల : గురుకులాలు, కస్తూరిబా పాఠశాలలు, వసతి గృహాల్లో ఉండి విద్యనభ్యసించే విద్యార్థినులు మానసిక ధైర్యంతో ఉండి పాజిటివ్ దృక్పథం కలిగి ఉండాలని కోదాడ పట్టణానికి చెందిన మోటివేటర్ యాదా స్వాతి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసంపై ఆమె అవగాహన కల్పించి మాట్లాడా రు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రత్యేక అధికారి సునీతారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విప్లవ పార్టీలకు ప్రజలు అండగా నిలవాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి శివకుమార్

నేరేడుచర్ల : ప్రజా సమస్యలపై పోరాడే విప్లవ పార్టీలకు ప్రజలు అండగా నిలవాలని సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. గురువారం నేరేడుచర్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అగ్రకులాల అహంకారానికి కారంచేడు ఘటన నిదర్శనమని, ఆ ఘటన జరిగి నేటికీ 40 ఏళ్లు అయిందని, దగ్గుబాటి చెంచురామయ్య ఆధ్వర్యంలో అమాయకులైన దళితులపై దాడి చేశారని, ఈ దాడుల్లో ఏడుగురు మృతి చెందగా మరో 100 మందికి తీవ్ర గాయాలయ్యాయని గుర్తు చేశారు. అవే దాడులు ఇంకా దేశంలో జరుగుతునే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాసా పల్లయ్య, హుస్సేన్, వాసా కరుణాకర్, అంబటి భిక్షం, లక్ష్మి, పాతిమా, కృష్ణమ్మ, మరియమ్మ, సుమలత, శ్యామల ఉన్నారు.

అసంపూర్తిగా ఆరోగ్య ఉపకేంద్రాలు

- అద్దె గదుల్లో రోగులకు వైద్య సేవలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



యాతవాకిళ్లలో అసంపూర్తిగా ఉన్న హెల్త్ సబ్‌సెంటర్

మఠంపల్లి : మండలంలో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. యాతవాకిళ్ల, వరదాపురం, బక్కమంతులగూడెం గ్రామాల్లో హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణానికి 2023లో ఒక్కో సబ్ సెంటర్‌కు రూ.20 లక్షల చొప్పున కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరయ్యాయి. నాటి నుంచి నేటివరకు మూడింటిలో ఏ ఒక్క భవన నిర్మాణం పూర్తికాలేదు. బక్కమంతులగూడెంలో స్థలం లేక అసలు నిర్మాణమే మొదలు పెట్టలేదు. యాతవాకిళ్ల, వరదాపురంలో మూడు గదులు, వరండాతో స్లాబు వేసి వదిలేశారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే సబ్ సెంటర్‌ల నిర్మాణాలు నిలిచిపోయాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. భవనాలు పూర్తి కాకపోవడంతో అద్దె గదులలోనే రోగులకు సిబ్బంది వైద్యసేవలు అందిస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేక..

యాతవాకిళ్ల సబ్ సెంటర్ పరిధిలో యాతవాకిళ్ల, హనుమంతులగూడెం, కామాక్షికుంటతండా, భీల్యానాయక్‌తండా, బోడబండతండా, దుబ్బతండా గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలోని సుమారు 7వేల పైచిలుకు ప్రజలకు వైద్యసేవలు అందించాల్సి ఉంది. అదే విధంగా వరదాపురం, చెన్నాయిపాలెం, కిందితండా, మంచ్యాతండా, తుమ్మలతండా గ్రామపంచాయతీల పరిధిలోని సుమారు 5 వేల మంది ప్రజలకు వరదాపురం సబ్ సెంటర్ ద్వారా వైద్య సేవలు అందించాలి. కానీ అద్దె భవనాల్లో వైద్య సేవలు సరిగా అందడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఉంది. కానీ మండల కేంద్రానికి నేరుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో సుమారు 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. సబ్‌సెంటర్ల నూతన భవనాలు పూర్తయితే డాక్టర్‌లు కూడా అందుబాటులో ఉంటారని, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని నిర్మాణాలు పూర్తి చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.



యాతవాకిళ్లలో అద్దె గదిలో రోగులకు వైద్యం అందిస్తున్న సిబ్బంది

అందుబాటులోకి తేవాలి



వైద్యం కోసం మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వెళ్లడానికి మా గ్రామం నుంచి నేరుగా బస్సు సౌకర్యం లేదు. యాతవాకిళ్ల సబ్ సెంటర్‌ను అద్దెగదుల్లో కొనసాగిస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి సబ్‌సెంటర్ల నిర్మాణం పూర్తి చేయించి అందుబాటులోకి తేవాలి.

– బారెడ్డి సీతారాంరెడ్డి మాజీ సర్పంచ్, హనుమంతులగూడెం

అద్దెగదుల్లో ఇబ్బందులు



యాతవాకిళ్ల సబ్‌సెంటర్ పరిధిలో ఆరుగ్రామాలు ఉన్నాయి. సబ్ సెంటర్‌ను అద్దెగదుల్లో ఏర్పాటు చేయడంతో వైద్యం సేవలకు ఇబ్బందికరంగా మారింది. పీహెచ్‌సీ ఉన్న మండల కేంద్రానికి నేరుగా బస్సు లేకపోవడంతో ప్రజలు హుజూర్‌నగర్, కోదాడ లాంటి పట్టణాలకు వైద్యం కోసం వెళ్తున్నారు.

– కోలాహలం లక్ష్మీనరసింహరాజు, మాజీ సర్పంచ్, యాతవాకిళ్ల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



సబ్‌సెంటర్ల భవనాలు పూర్తికాకపోవడంతో అద్దె గదుల్లో వైద్యసిబ్బందితో వైద్యసేవలు అందిస్తున్నాం. ఆరోగ్యం ఉప కేంద్రాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్లతో మాట్లాడాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

– డాక్టర్ భూక్యా సుధాకర్‌నాయక్, మండల వైద్యాధికారి, మఠంపల్లి

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

మునగాల : తమ సమస్యలు పరిష్కరించాలని మండల ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు. ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోకపోవడంపై గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నిరసన తెలిపారు. తమకు పేస్కేలు అమలు చేయాలని, గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు మంజూరు చేయాలని, స్టేషనరీ బిల్లులు తక్షణమే చెల్లించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత సంవత్సర కాలంగా వేతనాలు మూడు, నాలుగునెలలకు ఒకసారి వస్తున్నాయని, ఇదేవిధంగా కొనసాగితే సమ్మె నోటీస్ ఇవ్వడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు దొడ్డారపు నాగేశ్వరరావు, కార్యదర్శి జి.శ్రీదేవి, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా నాయకులు ఆర్.లింగయ్య, విజయలక్ష్మి, కృష్ణవేణి, సులోచన, జానకి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

చిలుకూరు : మండల కేంద్రంలోని కాలువ ఒడ్డున గల శ్రీఅభయాంజనేయస్వామి ఆ లయ నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవా దాయ ధర్మాదాయ శాఖ చిలుకూరు మండల ఇన్‌చార్జ్ మేనేజర్ మృత్యుంజయ శాస్త్రి గురువారం తెలిపారు. ఆస్తకి గల వారు ఈ నెల చివరి వారంలోపు హైదరాబాద్‌లోని దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 60 మంది విద్యార్థుల ఎంపిక

చిలుకూరు : మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ఆవిష్కరస్ ఇండస్ట్రీస్ హైదరాబాద్‌కు చెందిన మూడు కంపెనీలు మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 250 మంది విద్యార్థులు పాల్గొనగా ఇంటర్వ్యూ, రాత పరీక్ష ద్వారా 60 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మధిర ప్రీతిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరెడ్డి మాట్లాడుతూ అమెరికా లాంటి అగ్ర దేశాల్లో సహితం గ్రామీణ ప్రాంతాల విద్యార్థులే సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ మధిర గౌతమ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, కంపెనీ హెచ్‌ఆర్ నవీన్, ప్లేస్‌మెంట్ అధికారిణి ప్రియాంక, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా పశువైద్యాధికారి

మఠంపల్లి : పాడి రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రాధికా దేశ్‌ముఖ్ అన్నారు. గురువారం మండలంలోని పెదవీడులో గల పశువైద్యశాలలో హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆమె జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. పశువులకు వ్యాధినిరోధక టీకాలు, బలవర్ధక మందులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఏరియా వెటర్నరీ డాక్టర్ కొణతం శ్రీనివాసరెడ్డి, పెదవీడు డాక్టర్ శ్రావణి, మార్కెట్ కమిటీ సెక్రటరీ సంపత్‌కుమార్, సూపర్‌వైజర్ ప్రవీణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌దేశ్‌ముఖ్, నాయకులు మంజీనాయక్, షేక్ కరీమ్, ఆదినారాయణరెడ్డి, యరగాని గోపి, రాగం లింగయ్య, వెంకటేశ్వరరెడ్డి, సుబ్బయ్య నాయుడు, భీముడు, తులసీరామ్ నాయక్, గోపిరెడ్డి, ఇంటి రవి తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంతో మరొకరికి పునర్జన్మ

మోతె : అవయవదానంతో మరొకరికి పునర్జన్మ లభించినట్లు అవుతుందని స్పందన స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడు గుండా రమేష్ అన్నారు. గురువారం మోతె మండలం రాఘవాపురంలో అవయవ దానంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కొమ్ము మల్లయ్య, రిటైర్డు విద్యాధికారి కట్ట ఎల్లారెడ్డిలు అవయవదానం, 13 మంది నేత్రదానం చేస్తామని అంగీకార పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి మిట్టకోల కోటయ్య, కోశాధికారి హెచ్.పిచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ గుండాల గంగులు, వైద్యాధికారి బి.స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



క్షయవ్యాధి నిర్ధారణ శిబిరంలో పాల్గొన్న వైద్యసిబ్బంది, ప్రజలు

మునగాల : క్షయవ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టీబీ నోడల్ పర్సన్ లింగం రామకృష్ణ సూచించారు. గురువారం మండలంలోని జగన్నాథపురంలో రేపాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిక్షయ్ శివిర్ క్షయవ్యాధి నిర్ధారణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిబిరంలో 19 మంది నుంచి కళ్లె సేకరించి పరీక్షల కోసం జిల్లా కేంద్రంలోని ల్యాబ్‌కు పంపించామని, 12 మందికి మందులు అందజేశామని తెలిపారు. శిబిరంలో టీబీ సూపర్‌వైజర్ సుభాషిణి, ల్యాబ్ టెక్నీషియన్ ఫణీందర్, ఏఎన్‌ఎంలు మిడిసిన మెట్ల నర్సమ్మ, గ్రామ పంచాయతీ సెక్రటరీ అనిత, ఆశవర్కర్ భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి సభ్యులు సహకరించాలి

కోదాడ రూరల్ : కాపుగల్లు ప్రాథమిక సహకార సంఘం అభివృద్ధికి సభ్యులు సహకరించాలని సంఘం చైర్మన్ నంబూరి సూర్యం కోరారు. గురువారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు కాపుగల్లు, రెడ్లకుంట గ్రామాలకు చెందిన రైతులకు, వృత్తిపనుల వారికి, చిరువ్యాపారులకు ఇచ్చిన పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, స్వయం ఉపాధి రుణాలు మొత్తం రూ.8 కోట్ల పైచిలుకు ఉంటుందన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు ఎప్పటి కప్పుడు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు ముత్తవరపు వీరయ్య, గుండెబోయిన వీరబాబు, మల్లెల రోషయ్య, బాలెబోయిన వెంకటేశ్వర్లు, మల్లెల ఆదినారాయణ, జిల్లా వెంకటేశ్వర్లు, ఏజెండ్ల సులోచన, పోలంపల్లి అచ్చమ్మ, సంఘం సెక్రటరీ జానీమియా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేబీస్ వ్యాధిపై అవగాహన అవసరం

గరిడేపల్లి : రేబీస్ వ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ వి.నరేష్ అన్నారు. గురువారం మండలంలోని రేగులగడ్డతండాలో రేబీస్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించి . మాట్లాడారు. కుక్క, కోతి, పిల్లి, ఎలుకలు కరిచినప్పుడు తప్పకుండా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని, కరిచిన వెంటనే గాయాన్ని సబ్బుతో కడగాలని, గాయం పైన పసుపు, పొడర్లు వేయకూడదని, కట్టు కట్టకూడదని సూచించారు. కుక్క కాటుకు గురైన వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అంజయ్య, ఎంఎల్‌హెచ్‌పీ అశోక్, వెటర్నరీ అసిస్టెంట్ ఉపేందర్, ఏఎన్‌ఎం అరుణ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్వానంగా మేజర్, మైనర్ కాల్వలు

- కంపచెట్లతో నిండి, పూడిపోయిన కాల్వలు
- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న ఆయకట్టు రైతులు



హుజూర్‌నగర్ శివారులో అధ్వానంగా బూరుగడ్డ మేజర్ కాలువ, ధ్వంసమైన కట్ట

హుజూర్‌నగర్ : మండలంలోని వివిధ గ్రామాల్లో పంట పొలాలకు నీటిని అందించే మేజర్, మైనర్ కాలువలు హుజూర్‌నగర్ పట్టణ శివారులో అధ్వానంగా తయారయ్యాయి. కాలువల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు మొలిచాయి. రాళ్లతో నిండి పూడాయి. పట్టణంలోని టీచర్స్ కాలనీ నుంచి దిగువకు వెళ్తున్న బూరుగడ్డ మేజర్ కాల్వ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. కాలువ కట్టను పట్టణ పరిధిలో తవ్వి ధ్వంసం చేశారు. ఈ కాలువ పరిధిలో దాదాపు 14 వందల ఎకరాల ఆయకట్టు ఉంది. దీంతో కాలువ పరిధిలోని రైతులు తమ పంట పొలాలకు నీరు అందే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ముక్త్యాల బ్రాంచ్ ప్రధాన కాలువ పరిధిలోని అనేక మేజర్, మైనర్ కాలువలు అధ్వానంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. అనేక ప్రాంతాల్లో డ్రాప్‌లు, తూములు పూర్తిగా దెబ్బతిన్నాయని పేర్కొంటున్నారు. కాలువల పరిస్థితి అధ్వానంగా ఉండడంతో ప్రభుత్వం నీరు విడుదల చేసినా కాలువ చివరి భూముల వరకు నీరు అందదని అంటున్నారు. నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి కాలువలకు మరమ్మతులు చేపట్టి సాగునీరు సక్రమంగా ప్రవహించేలా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ వినయ్‌ని సంప్రదించగా కాలువలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొనసాగుతున్న 'వంద రోజుల ప్రణాళిక'

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమం కొనసాగుతోంది. గురువారం 2వ వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త వేరు చేయూ విధానంపై మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పేదలు, వెడ్డీ వెండర్స్‌ను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ముందంజ



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పాల్గొన్న సంఘం నాయకులు

మునగాల : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో పీఆర్టీయూ ముందంజలో ఉందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, తీగల నరేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అడిదెల వెంకటరెడ్డి, మేకల మధుబాబు ఆధ్వర్యంలో చేపట్టిన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. పెండింగ్ డీఏ, జీపీఎఫ్ బిల్లులు త్వరితగతిన ఇప్పించడం, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయడం, మోడల్‌స్కూల్, కేజీబీవీలలో సమస్యలను సంఘం రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పప్పుల వీరబాబు, రిటైర్డు ఎంఈఓ ఓరుగంటి రవి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బూర సైదయ్య గౌడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొల్లు వెంకటేశ్వరరావు, గోదేశి దయాకర్, రాష్ట్ర కార్యదర్శి పందిరి బ్రహ్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మట్టపల్లి రాము, ఊట్కూరి రవీందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు అల్లా భిక్షపతి కాంపెల్లి గోపిరెడ్డి, మఠంపల్లి మండల అధ్యక్షుడు కందరబోయిన లింగారావు, మండల అసోసియేట్ అధ్యక్షుడు బజ్జూరి శ్రీకాంత్‌రెడ్డి, సభ్యులు ఎం.సతీష్, ఆర్.నాగరాజు, ఉపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారి పిడమర్తి సునీత పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. మండల విద్యాధికారి బి.ఉపేందర్‌రావు, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తీగల నరేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు బాణోతు నాగేశ్వరరావు, వీసాల కోటయ్య, రాష్ట్ర అసిసోసియేట్ అధ్యక్షుడు సామినేని శ్రీనివాసరావు, గోలేటి దయాకర్‌రావు, రాష్ట్ర అసోసియేట్ మాజీ అధ్యక్షుడు ఓరుగంటి రవి, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గుత్తా కరుణ, నాయకులు కొల్లు నాగేశ్వరరావు, కందరబోయిన లింగారావు, సాదు బ్రహ్మానందం, పోలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దారి నిర్మించి.. ప్రమాదాలు నివారించి

- అయ్యప్పస్వామి ఆలయానికి రాకపోకలకు మార్గం సుగమం



ఆలయానికి వెళ్లేందుకు నిర్మించిన దారి

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప ఆలయంతో పాటు షిర్డీసాయిమందిరానికి వెళ్లేందుకు అనువుగా సాయిమందిరం నిర్వాహకులు దేవినేని రవికుమార్, అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో గురువారం దారి ఏర్పాటు చేశారు. ఆలయానికి వెళ్లి తిరిగి రావాలంటే జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో వెళ్లాల్సి ఉంది. గతంలో రాంగ్‌రూట్‌లో వెళ్తున్న భక్తుల ట్రాక్టర్ ప్రమాదానికి గురై ఆరుగురు దుర్మరణం పాలుకాగ పలువురు క్షతగాత్రులయ్యారు. నాటినుంచి భక్తులు ఆలయానికి వెళ్లి తిరిగి రావాలంటే రాంగ్‌రూట్‌లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోంది. దీంతో మండల కేంద్రం నుంచి కోదాడ వైపు వెళ్లే దారిలో రహదారి పక్కన ఉన్న కంపచెట్లను జేసీబీ సాయంతో తొలగించి దారి సౌకర్యం కల్పించారు. దీంతో భక్తులు హైవేపై కాకుండా ఈదారి గుండా మండల కేంద్రానికి చేరుకునే వీలు కలుగనున్నది. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

వర్షాలు కురవాలని కప్పకాముడు



నేలమర్రిలో కప్పకాముడు ఆడుతున్న మహిళలు

మునగాల : వర్షాలు కురవాలని వరుణదేవుడిని ప్రార్థిస్తూ మునగాల మండలం నేలమర్రిలో గురువారం మహిళలు కప్పకాముడు ఆడారు. కర్రకు వస్త్రంలో కప్పలను కట్టి వేప మండలు చుట్టి పాటలు పాడుతూ ఇంటింటికి తిరిగారు. పసుపు, కుంకుమ పెట్టి, నీళ్లు ఆరబోసి కొబ్బరి కాయ కొట్టి పూజలు చేశారు. అనంతరం కప్పలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఊరి చివరన బావిలో వేశారు. కార్యక్రమంలో బచ్చలకూర గుర్వమ్మ, రెమిడాల వెంకటమ్మ, తాళ్లపాక శివరాణి, బి.మాణిక్యం, బి.సుశీల, బి.భద్రమ్మ, బి.నాగమణి, నకిరేకంటి సావిత్రి, సైదమ్మ, మంగమ్మ, నందిపాటి కవిత, కొలికపంగు ఎల్లమ్మ పాల్గొన్నారు.

పొంచి ఉన్న పెను ప్రమాదం



వడ్డెర కాలనీలో దిమ్మె కూలి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

నడిగూడెం : మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన దిమ్మె పూర్తిగా దెబ్బతిన్నది. ఏ క్షణంలోనైన కూలేవిధంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ కూలితే ఆ ప్రాంతంలో ఉన్న విద్యుత్ స్తంభాలు కూలి స్థానిక ఇళ్లతో పాటు పక్కనే ఉన్న ప్రధాన రహదారిపై రాకపోలకు సాగించే ప్రజలపై విద్యుత్ తీగలు పడి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని వడ్డెర కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అత్యవసరంగా మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థికి ట్రిపుల్ ఐటీలో సీటు

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసిన శృతి ట్రిపుల్ ఐటీ బాసరలో సీటు సాధించింది. ట్రిబుల్ ఐటీ రెండవ జాబితాలో శృతిని సీటు వచ్చింది. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు శోభ, సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్ శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు రాఘవరెడ్డి, వెంకటేశ్వర్లు, గోపయ్య, కేఆర్ శ్యాంసుందర్‌రావు, అనిల్ కుమార్, సైదులు, ఏసుపాదం, లింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి.. శృతిని అభినందించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో గురువారం హుజూర్‌నగర్ మండలం సింగారం గ్రామానికి చెందిన గూడెం సాయిగోపాల్ పుట్టినరోజును పురస్కరించుకొని అన్నదానం చేశారు. శరణ్య, భానుప్రకాశ్‌శర్మ, నాగలక్ష్మి, ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని నరసయ్యగూడెంలో గురువారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. బాధిత మహిళ ఉమ్మడి సైదమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సయ్యగూడెంకు చెందిన ఉమ్మడి సైదమ్మ గురువారం ఉదయం గేదెను చెరువు సమీపానికి మేతకు తొలుకపోగా పొలాల్లో తేగిపడి ఉన్న విద్యుత్ వైరు గేదెకు తగలడంతో అక్కడిక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందని, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే తన గేదె మృతి చెందిదని, విద్యుత్ అధికారులు నష్టపరిహారం చెల్లించాలని బాధిత మహిళ డిమాండ్ చేశారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్

హుజూర్‌నగర్ : ఫొటో, వీడియోగ్రాఫర్స్ హుజూర్‌నగర్ మండల అసోసియేషన్ అధ్యక్ష పదవికి గురువారం పట్టణంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 105 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా అధ్యక్షుడిగా ఎం.శ్రీకాంత్ గెలుపొందినట్లు ఎన్నికల కమిటీ చైర్మన్ లక్ష్మణ్ తెలిపారు. కార్యక్రమంలో మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ పాల్గొన్నారు.

రాఘవాపురంలో కంటి వైద్య శిబిరం

మోతె : మండలంలోని రాఘవాపురంలో సూర్యాపేట జమ్మిగడ్డ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 126 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 13 మందిని శస్త్ర చికిత్సకు సూర్యాపేటకు తరలించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కట్ట ఎల్లారెడ్డి, పజ్జూరి భిక్షం, కొరిపెల్లి విక్రమ్, దుశ్చర్ల కృష్ణ, బత్తిని బుచ్చయ్య, నిమ్మల ఎల్లారెడ్డి, వీరబోయిన మల్లయ్య, ప్రధానోపాధ్యాయుడు లింగయ్య పాల్గొన్నారు.

వెంకటేశ్వరరెడ్డికి నివాళి

నడిగూడెం : మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ సీనియర్ నాయకుడు తిప్పిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (67) ఇటీవల మృతి చెందారు. గురువారం గ్రామంలో నిర్వహించిన సంతాప సభలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు అల్వాల రామారావు, గ్రామ శాఖ అధ్యక్షుడు రామిరెడ్డి పాల్గొని.. వెంకటేశ్వరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈద శ్రీనివాసరెడ్డి, గందం వెంకటేశ్వర్లు, మారిశెట్టి నర్సింహారావు, గోవిందరెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, పొన్నం యేసయ్య, గోవిందు, బారి వెంకన్న,వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంతో మానసిక ప్రేరణ

గరిడేపల్లి : వ్యక్తిత్వ వికాసంతో మానసిక ప్రేరణ పొందగలమని స్టూడెంట్ మోటివేషనల్ స్పీకర్ చారుగండ్ల రాజశేఖర్ అన్నారు. గురువారం గరిడేపల్లిలోని కేజీబీవీ, గడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, మానసిక ప్రేరణపై తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ పానుగోతు ఛత్రునాయక్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జె.ప్రసన్నకుమారి, డి.నాగరాజు, కేజీబీవీ ఎస్‌ఓ వై.శైలజ, కల్పన, సీఆర్‌పీ రామకృష్ణ, హాస్టల్ కేర్ టేకర్ పార్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.